క్లుప్తంగా

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు ప్రారంభం



రశీదు ప్రదర్శిస్తున్న పీఆర్‌టీయూ శ్రేణులు

బెల్లంపల్లి: పీఆర్‌టీయూ సభ్యత్వ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బెల్లంపల్లిలో ఆ సంఘ నాయకులు సభ్యత్వ నమోదు ప్రారంభించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి పలువురు ఉపాధ్యాయులకు రశీదు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజయ్‌కుమార్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రామస్వామి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఉమాకాంత్, కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు ప్రసన్న, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

తాండూర్: ఇళ్ల పట్టాల మంజూరు కోసం జీవో నంబర్ 59ప్రకారం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల సర్వేను మంగళవారం తాండూర్ మండల కేంద్రంలో నిర్వహించారు. 230మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో నుంచి 130మంది లబ్ధిదారుల ఇళ్లను రెవెన్యూ సిబ్బంది సర్వే చేశారు. మిగితా ఇళ్ల సర్వేను కూడా పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. సర్వే నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, నెన్నెల మండల డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, సర్వేయర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దొనబండలో ఆర్డీఓ పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలో 58, 59జీఓ కింద భూముల క్రమబద్ధీరణకు దరఖాస్తు చేసుకున్న వారి భూములను మంగళవారం ఆర్డీఓ వేణు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారి భూముల క్రమబద్ధీరణకు దరఖాస్తులు చేసుకోగా వారి వివరాలను విచారించారు. ఆర్డీఓ వెంట నాయబ్ తహసీల్దార్ హరిత, గిర్దావర్ లావణ్య ఉన్నారు.

సమస్యలు వింటూ.. భరోసా ఇస్తూ



సమస్యలు తెలుసుకుంటున్న సురేఖ

మంచిర్యాలటౌన్: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గడపగడపకూ వెళ్లి మంగళవారం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని వివరించారు. ఒడ్డెర కాలనీలోని గడపగడపకూ వర్షంలోనే వెళ్లిన డీసీసీ అధ్యక్షురాలికి ప్రతి ఇంటి ముందు వరద నీరు చేరి ఉండడంతో, ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో, మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలమయ్యాయని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలని కోరారు.

'బోదకాలు'పై అవగాహన

మంచిర్యాలటౌన్: వచ్చే నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు రకాల మాత్రలు మింగి బోదకాలు వ్యాధిని ఈ సమాజం నుంచి తరిమేద్దామని వైద్యారోగ్య శాఖ హెల్త్ ఎడ్యుకేటర్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్లు అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వో రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి గుండేటి నాందేవ్ బోదకాల వ్యాధిపై అవగాహన కల్పించారు.

సన్మానం

మంచిర్యాలటౌన్: భారతీయ జాతీయ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కొయ్యల ఏమాజి, అగల్‌డ్యూటీ రాజు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులుగా ఎన్నికైన పులగం తిరుపతిలను జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ముల్కల మల్లారెడ్డి, మున్నారాజా సిసోడియా, శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ వర్ధన్, కేశవ్‌రెడ్డి, రాజులాల్ యాదవ్, రామయ్య, శైలేంద్ర, మోటపలుకుల తిరుపతి, అజ్మీర శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, గోవర్ధన్, నరేశ్, బొప్పు సతీశ్ పాల్గొన్నారు.



హమాలివాడలో ధ్వంసమైన డ్రైయినేజీ



రైల్వే ప్రహరీకి ఆనుకుని తవ్వడంతో, కూలిపోయిన గోడ

నిధులు నీళ్లపాలు!

- పర్యవేక్షణ.. ప్రణాళిక లేకుండా నాసిరకంగా పనులు
- వర్షాలకు దెబ్బతింటున్న డ్రైయినేజీలు
- మంచిర్యాల మున్సిపాలిటీలో రూ.లక్షల నిధులు వృథా

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో లక్షల రూపాయల నిధులు వెచ్చించి రోడ్లు, డ్రైయినేజీ పనులను చేపడుతున్నా ఆయా పనుల నాణ్యతను పరిశీలించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో, నాణ్యత లేకుండానే కాంట్రాక్టర్లు నిర్మిస్తున్నారు. నిర్మాణాలు చేపట్టిన కొద్ది రోజులకే అవి కూలిపోతుండడం, నాసిరకంగా చేశారనేందుకు నిదర్శనం. జిల్లా కేంద్రంలో ఇటీవల కోట్లాది రూపాయలు వెచ్చించి, సీసీ రోడ్లు, డ్రైయినేజీల పనులను ప్రారంభించారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, ఆయా పనులను చేపట్టాల్సి ఉన్నా, కమీషన్ల కోసం లక్షల నిధులతో ఇష్టమొచ్చిన చోట పనులను ప్రారంభించి, నాసిరకంగా చేపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రోడ్లు, డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేసి ఆయా పనులను కాంట్రాక్టర్లు చేపట్టకుండా నెలల తరబడి కాలం వెల్లదీస్తున్నారు. దీంతో కాలనీ ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడితో, ఆయా కాంట్రాక్టర్లతో ప్రారంభించిన పనులను చేయించేందుకు మున్సిపల్ అధికారులు ఒత్తిడి తేవడంతో, నాసిరకంగా నిర్మాణాలను చేపడుతున్నట్లుగా ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్టు తీసుకున్న సమయానికి పనులను ప్రారంభించే సమయానికి మధ్యలో నెలల కొద్ది సమయాన్ని వృథా చేయడం వల్ల, ధరలు పెరుగుతున్నాయి. పెరిగిన ధరల ప్రకారం పనులను చేపడితే, లాభాలు రావనే, నాసిరకంగా పనులను కానిస్తున్నట్లుగా తెలుస్తోంది.

నాణ్యతతోనే కట్టిస్తాం



హమాలీవాడలో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులు ఇంకా పూర్తి కాలేదు. వర్షానికి నీరు నిల్వ ఉండడం వల్ల అది ఒక పక్కకు ఒరిగింది. దానిని తిరిగి మళ్లీ నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్‌కు డ్రెయినేజీకి సంబంధించిన బిల్లులను చెల్లించలేదు. డ్రెయినేజీని పూర్తి నాణ్యతతో కట్టిన తరువాతనే బిల్లు ఇస్తాం. అభివృద్ధి పనుల్లో పర్యవేక్షణ ఉంటుంది. ఎప్పటికప్పుడు పనులు పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

\- మధుకర్, మున్సిపల్ ఇంజినీర్

పర్యవేక్షణ కరువు

జిల్లా కేంద్రంలోని 14వ వార్డు హమాలీవాడలో ఆరు నెలల క్రితం మున్సిపల్ జనరల్ ఫండు రూ.30లక్షల వరకు కేటాయించి, సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం కోసం పనులను ప్రారంభించారు. రూ.12.50లక్షలతో హమాలీవాడకు వెళ్లే దారిలోనే రైల్వే ప్రహరీని ఆనుకుని డ్రెయినేజీ పనులను చేపట్టారు. అయితే రైల్వే ప్రహరీ వైపు ఒక్క ఇల్లు కూడా లేకపోవడం, రోడ్డుకు మరో వైపు ఉన్న ఇళ్ల వైపు డ్రెయినేజీని నిర్మించాలని కాలనీ ప్రజలు కోరినా అధికారులు అవేమి పట్టించుకోకుండా ప్రజలకు అవసరం లేనిచోట డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. డ్రెయినేజీ నిర్మాణంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే పనులను పూర్తి చేయడం గమనార్హం. రైల్వే ప్రహరీని ఆనుకుని డ్రెయినేజీ నిర్మాణం వల్ల, కాంట్రాక్టరుకు కొంత పనిభారం తగ్గిందనుకున్నాడో ఏమో గాని, గోడ పునాదిని ఆనుకుని డ్రెయినేజీని నిర్మించారు. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి నాసిరకంగా నిర్మించిన డ్రెయినేజీ ఒక పక్కకు వంగిపోగా, ప్రహరీ సైతం కూలిపోయింది. దీంతో మున్సిపల్‌కు నిధులు వృథా కాగా, రైల్వే గోడ కూలడంతో రైల్వేకు సైతం నష్టం ఏర్పడింది. డ్రెయినేజీ నిర్మాణం పనులు జరుగుతుంటే, అందుకు సంబంధించిన పనులను పర్యవేక్షించాల్సిన ఏఈ పట్టించుకోకపోవడం, నాణ్యత పరిశీలన లేకపోయినా, తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లనే డ్రెయినేజీ పూర్తిగా వంగిపోయినట్లు తెలుస్తోంది. మున్సిపల్‌కు ఏఈల కొరత ఉండగా, ఉన్న ఇద్దరు ఏఈలలో ఒకరికి టూటౌన్, మరొకరికి వన్‌టౌన్ పనులను అప్పగించారు. టూటౌన్‌లో అభివృద్ధి పనుల పర్యవేక్షణ సక్రమంగా ఉండడం లేదని, అందువల్లనే నాణ్యత లేకుండా పనులను చేపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఎక్కువ కాలం మన్నికగా ఉండేలా అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ స్తంభం తొలగించకుండానే...

కార్మిక కుటుంబాల ఆందోళన

■ బొగ్గుబాయి వార్తలు



ఆందోళన చేస్తున్న కార్మిక కుటుంబాలు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మిక వాడలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడంలో సింగరేణి యాజమాన్యం విఫలమైందని పలువురు కార్మిక కుటుంబాలు ఆరోపించారు. కార్మిక వాడలకు శుద్ధజలాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ పలు కార్మిక కుటుంబాలు మంగళవారం సాయంత్రం షిర్కే చౌరస్తాలో బైఠాయించి ఆందోళనకు దిగారు. రెండు సంవత్సరాలుగా కార్మిక వాడలకు మురుగు నీరు సరఫరా అవుతుందని ఆరోపించారు. స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సింగరేణి అధికారులు వచ్చి తమ సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదని, న్యాయం కావాలంటూ నినాదాలు చేస్తూ అక్కడే బైఠాయించారు. సమాచారం అందుకున్న సీసీసీ నస్పూర్ అదనపు ఎస్సై సంతోష్ వచ్చి సింగరేణి అధికారులతో మాట్లాడారు. సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలుపడంతో కార్మిక కుటుంబాలు తమ ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో ఎం.రామారావు, తులా అనిల్‌కుమార్, సమ్ము అమృత్, రేణుక, కృష్ణవేణి, కళ, ఇజాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న కార్మికులకు మంగళవారం నిర్వహించిన చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించినట్లు పర్సనల్ డీజీఎం అరవిందరావు తెలిపారు. 73మంది కార్మికులు మంత్లీ రేటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారని, అందులో 33మంది క్వార్టర్లు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రఘుకుమార్, డీజీఎం రాజేశ్వర్‌రావు, మల్లయ్య, సివిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ గుండెరావు, సీనియర్ అసిస్టెంట్ లక్కాకుల శ్రీధర్, కార్మికులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

నస్పూర్: ప్రతీ కార్మికుడు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6గనిపై కార్మికులకు మంగళవారం రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు, గ్రూపు ఇంజినీర్ వీరన్న, డీజీఎం, ఎస్‌ఎంటీఎస్ ఆర్‌జీ రీజియన్ శర్మ, ఆర్‌కే6 ఎస్‌ఓఎం తిరుపతి, ఫిట్ సెక్రటరీ వెంగళ కుమారస్వామి, గని కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్ చెల్లించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం ఏరియా జీఎం మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వేమనపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ..



చెన్నూర్: వినతి పత్రం ఇస్తున్న తపస్ నాయకులు

చెన్నూర్/వేమనపల్లి/తాండూర్/కోటపల్లి: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని తపస్ ఉద్యమ కార్యచరణలో భాగంగా పలు మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు ఉపాధ్యాయులు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. చెన్నూర్‌లో నాయబ్ తహసీల్దార్ గోవింద్‌సింగ్‌కు, కోటపల్లిలో తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు, వేమనపల్లిలో తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు, తాండూర్‌లో తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రాలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టె నాగరాజు, నాయకులు తొడె తిరుపతి, భాగ్యలక్ష్మి, హరిణి, గీతాబాయి, నాగేశ్వర్, పాల్గొనగా కోటపల్లిలో జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, నాయకులు మల్లేశ్, ప్రవీణ్, కరీం, సాబీర్, తాండూర్‌లో తపస్ జిల్లా కార్యదర్శి భారతి అశోక్, మండల అధ్యక్షుడు రమేష్, విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుధాకర్ రెడ్డి, గోపి, వేమనపల్లిలో తపస్ మండల శాఖ అధ్యక్షుడు దుర్గం చందు, నాయకులు దాసరి మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సందర్శన



విద్యార్థిని ప్రతిభను పరీక్షిస్తున్న డీఈవో

దండేపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈవో యాదయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వర్షకాలం ప్రారంభమయ్యింది కాబట్టి సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగతశుభ్రత పాటించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రతి అంశాన్ని చక్కగా నేర్చుకోవాలని సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థుల ప్రతిభ సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో కొందరు కండ్లకలతతో బాధపడుతుండటంతో, సమస్యను డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులను పంపాలని కోరారు. సమస్యలపై ఆరా తీశారు. ఎస్వో మంజుల, సీఆర్పీ నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

కాలువల్లో పూడికతీత



పనులు పరిశీలిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని 12, 13వార్డుల పరిధిలో ఉన్న మురుగు నీటి కాలువల్లో నిండిన పూడికను మంగళవారం మున్సిపల్ యంత్రాంగం తీయించారు. ఏళ్ల తరబడి నుంచి కాలువల్లో నిండిన పూడికను జేసీబీ సాయంతో తొలగించే చర్యలను మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ సమ్మయ్య చేపట్టారు. కాలువ పక్కన ఉన్న జనావాసాలకు దుర్వాసన రాకుండా చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నెల్లి శ్రీలత, బండి ప్రభాకర్, ఏఈ సందీప్, పర్యావరణ ఇంజినీర్ సంతోష్, ఇన్‌చార్జి సాని టరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన

- మణిపూర్ దోషులను శిక్షించాలని డిమాండ్



చెన్నూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ



రాస్తారోకో చేస్తున్న సీపీఎం శ్రేణులు

తాండూర్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన దాష్టికాన్ని నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ఐబీ జాతీయ రహదారిపై సీపీఎం, సీఐటీయూ శ్రేణులు రాస్తారోకో చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం తాండూర్ మండల కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు నానయ్య, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సీఎంను బర్తరఫ్ చేయాలి

చెన్నూర్: మణిపూర్ మారణహోమానికి కారణమైన సీఎం బీరేన్‌సింగ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. మారణహోమాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జలాల్ పెట్రోల్ బంక్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొడెంకి చందు, ఎండీ అవేజ్, ఉమారాణి, సంధ్య, సమ్మక్క, సరిత, రేణుక, ప్రసన్నకుమార్, శేఖర్ చారి, రుక్సానా, మదునక్క పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఐబీ చౌరస్తాలో సీపీఐ, సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ, ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐఎం జిల్లా కార్యదర్శి ప్రకాష్, సీపీఐ నాయకులు రేగుంట చంద్రశేఖర్, ఇప్పకాయల లింగయ్య, ప్రేంకుమార్, రజిత, మోహన్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: మణిపూర్‌లో కుకి గిరిజనులపై జరుగుతున్న దాడులు ఆపాలని, ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి హత్యాచారాం చేసిన దోషులను ఉరితీయాలని ప్రగతిశీల మహిళాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకురాళ్లు అరుణ, ఓదక్క, లక్ష్మి, శ్రావణి, సుమలత, రాజేశ్వరి, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి



జెడ్పీటీసీకి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కోటపల్లి/భీమారం/మందమర్రిరూరల్: పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోటపల్లిలో టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారికి ఆయన మద్దతు ప్రకటించారు. భీమారంలో తమ సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని జెడ్పీటీసీ బుక్యా తిరుమలకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. మందమర్రిలో తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, జెడ్పీటీసీ వేల్పుల రవికి వినతిపత్రం అందించారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: అసెంబ్లీ నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతి నిధులకు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల గురించి వివరించి, సలహాలు, సూచనలను తీసుకున్నారు. పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్స్ ప్రపోజల్‌కు సంబంధించిన వాటిని తయారు చేసి, రాజకీయ పార్టీ ప్రతినిధులకు చూపినట్లు తహసీల్దార్ రాజేశ్వర్ తెలిపారు.

భీమిని/మందమర్రిరూరల్: వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ సిబ్బంది ఓటర్లకు ఈవీఎం యంత్రాలపై అవగాహన కల్పించారు. ఓటును ఎలా వినియోగించుకోవాలి. ఓటు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సూచనలు ఓటర్లకు వివరించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు చేసే విధి విధానాలపై బీఎల్‌వోలకు అధికారులు అవగాహన కల్పించారు.

వినూత్న ఆలోచన



నెన్నెల: పొలాల్లో దమ్ము చేసేందుకు దమ్ము చక్రాలతో వెళ్లే ట్రాక్టర్లతోతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. రహదారులపై వెళ్లొద్దని నిషేధించినా కొందరు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన ఓ రైతు వినూత్నంగా ఆలోచించాడు. వీల్స్ ఉన్న ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ హైడ్రాలిక్ పట్టిపై ఎక్కించి కదలకుండా ఇనుప వైర్లు, క్లిప్‌లతో గట్టిగా జాయింట్ చేసి వీల్స్‌ను రోడ్డుకు తగలకుండా ఇలా తరలించాడు. నెన్నెల టీ రోడ్డు వద్ద మంగళవారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

సంక్షిప్త వార్తలు

'ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి'

చెన్నూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపణ మేరకు విచారణ జరిపిన అధికారులు నామమాత్రంగా మెమో జారీ చేయడమేమిటని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. స్థానికంగా మంగళవారం మాట్లాడారు. మంత్రి కొప్పుల ఈశ్వ ర్ బంధువని చెప్పడంతో అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు గోపాల్, ప్రవీణ్‌కుమార్, నితీశ్, రాజేశ్, సల్మాన్‌లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీలోని సోషల్ వెల్ఫేర్ గురుకులంను ఇతర చోటుకు తరలించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ఆర్‌సీవో స్వరూపరాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నీగౌడ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు తిరుపతి, అభినవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాణిరావుకు శ్రద్ధాంజలి

మంచిర్యాలటౌన్: రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ట్రెజరర్ కె.పాణిరావు గత శుక్రవారం గుండెపోటుతో చనిపోగా, జిల్లా కేంద్రంలోని రంగంపేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ మధు, కార్యవర్గ సభ్యుడు కృష్ణ, కోచ్ నాగేందర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్‌లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గొర్రెలను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలోని ఆరుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 21గొర్రెలను అందించారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ బ్యాగులు, నోట్‌బుక్స్, జామెట్రీ బాక్స్‌లను మంగళవారం అందించారు.

వెదజల్లే పద్ధతిపై రైతులకు అవగాహన

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని సుందరసాలలో రైతులకు వరిలో వెదజల్లే పద్ధతిపై ఏవో కవిత అవగాహన కల్పించారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

మందమర్రిరూరల్: పట్టణంలోని దొరలతబంగ్లాస్ ఏరియాలో గల పోలేరమ్మ ఆలయం వద్ద మంగళవారం పోలేరమ్మ జాతర ఘనంగా నిర్వహించారు.

అధ్యక్షుడికి సన్మానం

పాతమంచిర్యాల: పట్టణానికి చెందిన కొత్తపల్లి రమేష్‌ను కాంగ్రెస్ ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు.

కార్యవర్గం ఎన్నిక

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ గ్రామ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎనున్నకున్నారు. అధ్యక్షుడిగా వాసాల నరేశ్, ఉపాధ్యక్షుడిగా గంగవరపు మల్లేశ్, కోశాధికార్లుగా హన్మండ్ల వేణు, లచ్చన్నలను ఎన్నుకున్నారు.